క్లుప్తంగా

నేడు ఊరేళ్లలో ఉచిత మెగా వైద్యశిబిరం

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని ఊరేళ్లలో టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి తెలిపారు. చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పేద ప్రజలకు సరైన వైద్యం అందించాలనే ఆలోచనతో ఈ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. గ్రామంలోని పేద ప్రజలు, గ్రామస్తులందరూ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్యశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు దంత, కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్ష నేడు

మొయినాబాద్‌రూరల్: గురుకులాల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా రాత పరీక్ష నిర్వహిస్తున్నామని సాంఘిక సంక్షేమ మహిళా వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కోట అన్నారు. ఆమె శనివారం మాట్లాడుతూ.. 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఆదివారం గురుకులాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారని సూచించారు. ఇందుకు విద్యార్థులు 9 గంటల వరకు సంబంధిత కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. వికారాబాద్ డిగ్రీ కళాశాలలో 550 మంది విద్యార్థులకు సెంటర్ ఏర్పాటు చేశామని, మొయినాబాద్ మండలంలోని టోల్‌కట్ట సమీపంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాల కలదని తెలిపారు.

నేటి నుంచి మండలస్థాయి క్రికెట్ పోటీలు

చేవెళ్ల: మండలంలోని యువత కోసం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దోళ్ల దయాకర్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్దోళ్ల పర్మయ్య పేరుపై ఈ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేవెళ్లలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం నుంచి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పోటీలలో మండలస్థాయి జట్లకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యువత ఈ పోటీలలో పాల్గొనేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ పోటీలలో అంపైర్‌లదే తుది నిర్ణయమని, ప్రతి రోజు రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఎవరైనా పాల్గొనాలంటే ముందుగా నిర్వాకులను కలిసి ఎంట్రీ ఫీజు రూ.2,500 కట్టి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు 25,000లు ట్రస్ట్ ద్వారా అందజేస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం నిర్వాహకులు సురేందర్ రెడ్డి, కే.మహేందర్, పి.శ్రీధర్ ఫోన్ నెంబర్లు 9573325933, 9666017852, 8247755361లను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పల్లకీసేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి పల్లకీ సేవకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, మాజీ కౌన్సిలర్ లతాశ్రీ, భక్తులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



పూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: శివమాల ధరించిన స్వాములు శనివారం శ్రీశైలం బయలుదేరారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామంలో గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూజలో స్వామివారి భక్తిగీతాలతో గ్రామంలోని వీధులు మార్మోగాయి. అనంతరం స్వాములకు ఇరుముళ్ల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల శివస్వాములు పాల్గొన్నారు.

డేంజర్ జంక్షన్లు

పెరిగిన వాహనాల రద్దీ

- విస్తరణకు నోచుకోని రహదారులు
- వేగ నియంత్రణ, సూచిక బోర్డులు నిల్
- ప్రమాదాలకు నిలయంగా నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు



తుక్కుగూడ జంక్షన్

తుక్కుగూడ: దినదినాభివృద్ధి చెందుతున్న తుక్కుగూడ పురపాలికలో రహదారుల విస్తరణ అస్తవ్యస్తంగా ఉంది. అనేక పరిశ్రమలు కొలువుదీరి.. జనసంద్రం, వాహనాల రద్దీతో మున్సిపాలిటీ కళకళలాడుతోంది. కానీ.. రవాణామార్గం సరిగా లేక వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి నిదర్శనం నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు పరిధి తుక్కుగూడ, రావిర్యాల జంక్షన్లే.. ప్రస్తుతం ఈ రెండు కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూ.. రక్తసిక్తం అవుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. తుక్కుగూడ జంక్షన్ రోడ్డు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం రహదారి, హైదరాబాద్ రోడ్డుతో పాటు, పట్టణ పరిధి హార్డ్‌వేరు పార్క్, ఈ– సిటీ, రావిర్యాల జంక్షన్ రోడ్డు నుంచి నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయం, వండర్‌లా ఇలా అనేక నూతన పరిశ్రమలు రావడంతో వందలాది వాహనాల రాకపోకలతో ఈ రెండు జంక్షన్లు రద్దీగా ఉంటున్నాయి.

రోడ్డు విస్తరణ లేకపోవడంతో..

ఔటర్ రింగు రోడ్డును 2005లో నిర్మించారు. తుక్కుగూడ ఔటర్ జంక్షన్‌లో భారీ రింగు రోడ్డు నిర్మించే ఉద్దేశంతో అప్పట్లో రైతుల నుంచి భూమిని సేకరించారు. కానీ పలు కారణాల వలన రింగు రోడ్డు నిర్మించడం సాధ్యం కాలేదు. ప్రస్తుతం ప్రాంతం అభివృద్ధి చెందగా.. చిన్న, పెద్ద వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎలాంటి వేగ నియంత్రణ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

లారీ ఢీకొని గర్భిణి మృతి

గత నెల తుక్కుగూడ ఔటర్ జంక్షన్ వద్ద ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై వెళ్తున్న గర్భిణితో పాటు ఆమె తల్లి మృత్యువాత పడింది. రావిర్యాల జంక్షన్ వద్ద టిప్పర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలా జంక్షన్ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, వేగ నియంత్రణ, సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు.. ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీ వ్యాప్తంగా నీటి ఎద్దడి రాకుండా చూడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి సూచించారు. శనివారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేసవిలో మున్సిపాలిటీ ప్రజల దాహార్తి తీర్చడానికి ఇప్పటి నుంచే అధికారులు ప్రణాళికలను తయారు చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులుపై ఆరా తీశారు. నిలిచిపోయిన పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, డీఈఈ యాదయ్య, మేనేజర్ పర్వతాలు, ఏఈ పి.గుణాకర్, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ 13వ వార్డుకు చెందిన కే.బాబురావుకు మంజూరైన రూ.26 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం పుర కార్యాలయంలో ఆమె అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సప్పిడి లావణ్య రాజు, బాదావత్ రవినాయక్, సుమన్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి వంటపాత్రల బహూకరణ

మీర్‌పేట: మీర్‌పేట పాశ్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ మధ్యాహ్న భోజనం వండేందుకుగాను పాత్రలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లోనూ తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం అనిల్‌యాదవ్‌ను అంగన్‌వాడీ కేంద్రం, దీన్‌దయాళ్ నగర్ ప్రభుత్వ పాఠశాల సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ మాజీ డైరెక్టర్ మేకల యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు శశికళ, వింధ్య, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు రూప, సిబ్బంది మంజుల, పార్వతి పాల్గొన్నారు.



సిబ్బందికి వంట పాత్రలు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్

లోఓల్టేజీ సమస్యలకు పరిష్కారం

ఎస్ఈ మాధవరెడ్డి

హుడాకాంప్లెక్స్: వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని సరూర్‌నగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సి.మాధవరెడ్డి అన్నారు. 33/11కేవీ ఆటోనగర్ ఉపకేంద్రం, 33/11కేవీ హనుమాన్ ఉపకేంద్రం పరిధిలో గల కాలనీలు మన్సూరాబాద్, సెంట్రల్‌బ్యాంక్‌కాలనీ, సూర్యోదయ కాలనీ, మధురానగర్, హిమపురికాలనీ, ఆటోనగర్‌లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం కోసం కొత్త ఫీడర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం హనుమాన్‌నగర్ ఉప కేంద్రం పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన 11కేవీ శివాలయం ఫీడర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మాధవరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నర్సిరెడ్డి, విద్యుత్ డీఈలు కే.రామకృష్ణ, తిరుపతయ్య, ఏడీలు మధుకిరణ్, విజయభాస్కర్, ఏఈలు నిఖిల, శంకర్ పాల్గొన్నారు.



నూతన ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ మాధవరెడ్డి

లక్ష్య సాధనకు కృషిచేయాలి



క్రీడాకారుడికి బహుమతి అందిస్తున్న ఎస్ఐ శిరీష, ఏబీవీపీ నాయకులు

ఎస్ఐ శిరీష, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

చేవెళ్ల: విద్యార్థులు తమ లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ఎస్ఐ వనం శిరీష అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఐ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాదించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల కోసం ఏబీవీపీ ఇలాంటి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కల్యాణ్ సూర్యప్రకాశ్, జిల్లా కన్వీనర్ చందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్, నగర అధ్యక్షుడు శ్రీశైలం, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నితీశ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో కేఎల్లార్ తదితరులు

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరంలో మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. త్వరలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధుల విడుదల చేసి, రేషన్ కార్డులను అందిస్తామని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలో నిర్మాణం కానున్న ఫోర్త్ సిటీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీజేపీ కార్యకర్తలు కాసుల లడ్డు, పాలమూరు బాల్‌రాజ్, కాసుల సురేందర్, కాసుల కృష్ణ, బీఆర్ఎస్ కార్యకర్తలు చిట్టి బాబు, పవన్, సురేష్, హరీశ్, పరమేశ్, యాదయ్య, శ్రీశైలం పలువురు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇంద్రకంటి నర్సింహాగౌడ్, ఇంద్రకంటి వెంకటేశ్‌గౌడ్, ఆవ కొమురయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సోమేశ్, నాయకులు గండికోట శ్రీను, చిట్టి మల్లేశ్ పలువురు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొల్కొండ రాములు అనారోగ్య సమస్యతో బాధపొందుతున్నాడు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి రూ.1.50లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని వారి కుమారుడికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్మడి ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నడికూడ శివ, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఏర్పుల శ్రీశైలం, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ దేవాలయ నిర్మాణానికి ఎంఎస్ఆర్ సేవా సంస్థల అధినేత సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి శనివారం రూ.2లక్షల 21వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించి చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో భవానీ మాత ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రాజు, గ్రామస్తులు శ్రీపతిరెడ్డి, యాదయ్య, రామస్వామి, ఆర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయ సభ్యులకు చెక్కు అందజేస్తున్న సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి



అమ్మవారి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పండితులు

ఘనంగా పెద్దమ్మ కల్యాణం

కందుకూరు: మండల పరిధిలోని పెద్దమ్మతండాలో గల పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు ఎస్.లచ్యానాయక్ ఆధ్వర్యంలో బ్రాహ్మణుడు విజయభాస్కర్‌శర్మ పర్యవేక్షణలో ఉదయం అమ్మవారికి అభిషేకం, పూజల అనంతరం సుదర్శన హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మ వారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆదివారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తండావాసులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్ నీతా

ప్రిన్సిపాల్‌కు అభినందన

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినుల ఉన్నతికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ప్రోత్సాహం అందిస్తున్నారు. శనివారం సికింద్రాబాలోని హోటల్ యాత్రినివాస్‌లో భారతీయ యువశక్తి ట్రస్(బిస్ట్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి హాజరయ్యారు. భారతీయ యువశక్తి ట్రస్(బిస్ట్) సంస్థ విద్యార్థినులను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దేందుకు కృషిచేస్తుంది. అందులో భాగంగా విద్యార్థినుల అభ్యున్నతికి ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పాటుపడుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రిన్సిపాల్‌ను అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

విద్యార్థులకు దాతల ప్రోత్సాహం అవసరం

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఏఎంఆర్ ట్రస్టు చైర్మన్ ఎలుగంటి అభిరామ్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు 850 పరీక్ష ప్యాడ్లు, బాక్స్‌లు, స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు దాతలు సహకరిస్తే వారు మరింత ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని చెప్పారు. తాము సంపాదించిన దాంట్లో కొంత డబ్బు పేద విద్యార్థుల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. అనంతరం వారు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు రవీందర్‌నాయక్, మునగపాటి నర్సింలు, నాయకులు సూర్యగౌడ్, జంగయ్య, శ్రీనివాస్, శేఖర్, ఆంజనేయులు, ఖాసిఫ్, రఫిక్, దయాకర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

